సిద్దిపేటలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రివర్స్‌గేర్‌లో కాంగ్రెస్ పాలన

- పెట్టుబడులురాక రియల్ కుదేల్
- జిల్లాలో రద్దుతో మరిన్ని సమస్యలు
- బీజేపీ, కాంగ్రెస్ ఇచ్చింది గాడిదగుడ్డే
- రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమావేశంలో హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, మే 8: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అంతా రివర్స్‌గేర్‌లో నడుస్తున్నదని, తద్వారా పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిదారులు ముందుకు రావడంలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం ఆయన సిద్దిపేటలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత వివిధ రంగాల్లో పరిస్థితులు అధ్వానంగా మారాయని దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో పదేండ్లు అద్భుతంగా ఉన్న రియల్‌ఎస్టేట్ రంగం నేడు కుదేలైందని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్‌పై బురద జల్లి, ఆరు గ్యారెంటీలు ఎగబెట్టేందుకు రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తున్నదని, దీంతో పెట్టుబడులు రాక రియల్‌ఎస్టేట్ రంగం కుదేలైందని వివరించారు.కరోనా సమయంలోనూ కేసీఆర్ సమయానికి రైతుబంధు ఇచ్చారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదని మండిపడ్డారు. ఇదేనా మార్పు? అని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణకు గాడిదగుడ్డే ఇచ్చాయని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల పేరు మీద ఒక పార్టీ, మతం పేరిట మరో పార్టీ నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్లకు రూ.వేల కోట్లు మాఫీ చేసి కర్షకులను విస్మరించిందని మండిపడ్డారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలుచేశామని చెప్పుకుంటున్న రాహుల్‌గాంధీ, వాటిని అమలుచేసిన గ్రామాల్లోనే ఓట్లు అడగాలని సవాల్ చేశారు.టీవీ చూస్తే తిట్లు, దేవుడు మీద ఒట్లు.. ఈ రెండే కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలను రద్దుచేసే కుట్ర చేస్తున్నదని, తద్వారా మరిన్ని సమస్యలు ఉత్పన్నం కాక తప్పదని హెచ్చరించారు. ప్రాణం పోయినా సిద్దిపేట జిల్లా రద్దును అడ్డుకుంటానని చెప్పారు. సిద్దిపేట అంటే ఎక్కడికి పోయినా గౌరవం ఉండేలా చేశానని, ఆ గౌరవాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. సిద్దిపేటకు వచ్చే నాయకులు మన మీద ప్రేమతో రావడం లేదని, మనలో ఉన్న ఐక్యతను దెబ్బతీసేందుకే వస్తున్నారని చెప్పారు. మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ దుబ్బాకలో ఏమీ చేయకపోవడంతో అక్కడి ప్రజలు, అసెంబ్లీ ఎన్నికల్లో 54 వేల ఓట్లతో ఆయనను ఓడించారని పేర్కొన్నారు. వెంకట్రామిరెడ్డి గెలుపు హరీశ్‌రావు గెలుపు అని, హరీశ్‌రావు గెలుపు కేసీఆర్ గెలుపు అని అన్నారు. సిద్దిపేటలో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగినా తాను పాల్గొన్నానని, హిందూ ధర్మ పరిరక్షణలో తాను భాగమయ్యానని, భవిష్యత్తులోనూ ఉంటానని హామీ ఇచ్చారు. ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట కోసం పనిచేస్తానని, కాంగ్రెస్ మీద కోపంతో బీజేపీకి ఓటు వేస్తే పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అవుతుందని హెచ్చరించారు. ఫేక్ ప్రచారం చేయడంలో బీజేపీ అభ్యర్థి దిట్ట అని, రేపటి నుంచి ఫేక్ ప్రచారం చేసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ, కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లోకి..

గద్వాల/వెల్దండ/మక్తల్‌టౌన్/మాగనూరు, మే 8 : కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలతో విసుగుచెందిన కార్యకర్తలు ఆయా పార్టీలను వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కల్వకుర్తి, మక్తల్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, చిట్టెం రామ్మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గద్వాల పట్టణంలోని 15వ వార్డుకు చెందిన 50 మంది నాయకులు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం అజిలాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు సిద్ధగోని రమేశ్‌గౌడ్‌తో పాటు 50 మంది కార్యకర్తలు, చారకొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దిరాజు, కొట్రకు చెందిన నాయకులు బూత్కురి మహేశ్, కొప్పు సాయికుమార్ మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం నివాసంలో కౌన్సిలర్ రాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 50 మంది యువకులు, మాగనూరు మండలం నేరేడుగం గ్రామంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 39 మంది నాయకులు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలతో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ఆడబిడ్డపై అభ్యంతరకర మాటలేల?

- మహేశ్వరానికి సీఎం అన్యాయం
- బీజేపీది మత రాజకీయం
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు/బడంగ్‌పేట, మే 8: ఈ ప్రాంత ఆడబిడ్డనైన తన పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఇష్టానుసారంగా అభ్యంతరకరంగా మాట్లాడుతూ చులకన చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం రాత్రి రంగారెడ్డి జిల్లా కందుకూరులోని మెయిన్‌రోడ్డుతోపాటు మహేశ్వరం మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి ఎన్నికల సభల్లో ఆమె మాట్లాడారు. తాను రాత్రి బీజేపీకి, ఉదయం బీఆర్ఎస్‌కు ప్రచారం చేస్తున్నట్టు సీఎం ఆరోపిస్తున్నారని, బీజేపీకి ప్రచారం చేయాల్సిన గతి తనకు పట్టలేదని తెలిపారు. ముందు గత ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయాలని రేవంత్‌రెడ్డిని ఆమె డిమాండ్ చేశారు. మోసపూరిత హామీలతో అధికారం లోకి వచ్చి ఆరు గ్యారెంటీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఈ లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కందుకూరుకు మంజూరైన మెడికల్ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి రద్దు చేసి కొండంగల్‌కు తీసుకెళ్లి ఈ ప్రాంతానికి మోసం చేశారని విమర్శించారు. మెట్రో, ఫార్మాసిటీలను సీఎం ఎందుకు రద్దు చేశారని ఆమె ప్రశ్నించారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి చేవెళ్లకు చేసింది గుండు సున్నా అని ధ్వజమెత్తారు. బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా సభల్లో ఎస్సీ కమిషన్ మాజీ మెంబరు నర్సింహ, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మార్కెట్ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజునాయక్, చంద్రయ్య, అనుమగల్ల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సబితారెడ్డి

రైతుబంధుపై రేవంత్ దొంగ నాటకాలు

- వేసినట్టే వేసి.. మళ్లీ ఆగేలా చేశారు
- కేసీఆర్‌కు మద్దతిస్తేనే కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పినట్టు
- మీడియాతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- ఆత్మకూర్(ఎస్)లో ఇంటింటి ప్రచారం

సూర్యాపేట, మే 8 (నమస్తే తెలంగాణ): ఏడేండ్లుగా రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం అందిస్తే, కాంగ్రెస్ సర్కార్ మొండిచేయి చూపిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఓ సీజన్ పూర్తయినా ఇంకా రైతుబంధు ఇవ్వకుండా.. ఎన్నికల కమిషన్ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి దొంగ నాటకాలు అడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ జనంలోకి రాగానే లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని రేవంత్‌రెడ్డి భావించి రైతుబంధు ఇస్తున్నట్టు ప్రకటన చేశారని, వెంటనే తానే పనిగట్టుకొని ఆగేలా చేశారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతుబంధు పంపిణీ విషయంలో ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తే తాము మద్దతిస్తామని గతంలోనే కేసీఆర్ చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఇంకా యాసంగి సాయం అందక ముందే వానకాలం సీజన్ మొదలైందని తెలిపారు. మరో పదిరోజుల్లో ప్రారంభం కానున్న వానకాలం సీజన్ కోసం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాపై రేవంత్ ప్రమాణం చేస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ వ్యవహారం చూస్తే రైతుబంధుతోపాటు అనేక పథకాలు అమలు చేస్తారన్న నమ్మకం కనిపించడం లేదని చెప్పారు. రైతులకు ఇదే చివరి రైతుబంధులా కనిపిస్తున్నదని తెలిపారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతిస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పినట్టు అవుతుందని అన్నారు.



సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

రైతులకు పరిహారం చెల్లించాలి..

రాష్ట్రంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. ఐకేపీల్లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం వల్లే అకాల వర్షాలకు నష్టం జరుగుతున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెంటనే సంబంధిత కలెక్టర్లను ఆదేశించి నష్టపోయిన మామిడి, వరి రైతులను గుర్తించి ఎన్నికలు ముగిసిన వెంటనే నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

- బిడ్డా.. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రచార వేదిక వద్దకు చేరుకున్న కొందరు వృద్ధులు.. నేరుగా ఎమ్మెల్యే పల్లా దగ్గరికి వచ్చి 'బిడ్డా.. అంటూ అప్యాయంగా పిలిచి.. కేసీఆర్ సారు ఉన్నప్పుడే బాగుండే. మళ్లా ఆ సారే రావాలి.. వస్తాడు' అని ముచ్చటించారు. –చేర్యాల

నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బీజేపీ కార్పొరేటర్ సవిత, శ్రీనివాసరావు

అర్వింద్ రావణాసురుడు

- లంకలా నిజామాబాద్
- ఇంటిపేరు 'దుర్మార్గపు'
- డేరాబాబా, నిత్యానందే బెటర్
- రాజకీయ వ్యభిచారి..
- రూ.4 కోట్లు మోసగించిన ఘనుడు
- బీజేపీ ఎంపీపై సొంత పార్టీ నేతల ధ్వజం

ఖలీల్‌వాడి మే 8: బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ రావణాసురుడు అని సొంత పార్టీ నేతలే సంచలన ఆరోపణలు చేశారు. నిజామాబాద్‌ను లంకలా ఏర్పాటుచేసుకొని దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు మీసాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ సవిత తదితరులు మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీచేస్తున్న ఎంపీ అర్వింద్‌కు ఓటు వేయొద్దని ప్రజలను కోరారు. ఆ కేడీని ఓడించాలని అన్నారు. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి దించడానికి కారణం ఈ దుర్మార్గడేనని వ్యాఖ్యానించారు. మేయర్‌ను చేస్తానని చెప్పి అర్వింద్ తమ వద్ద రూ.4 కోట్లు తీసుకుని, చివరి నిమిషంలో వేరే వాళ్ల పేర్లు తెర మీదకు తీసుకొచ్చారని మండిపడ్డారు. అర్వింద్ కంటే డేరాబాబా, నిత్యానంద చాలా మంచివాళ్లు అని వెల్లడించారు. రాజకీయ వ్యభిచారి అయిన అర్వింద్ కారణంగా పార్టీ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నదని బీజేపీ పెద్దలను హెచ్చరించారు. ఎంతో మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ముఖ్య కార్యకర్తలను ముప్పుతిప్పలు పెడుతున్నారని, ఆయనకు బదులు వేరే వాళ్లకు టికెట్ ఇస్తే ఈజీగా గెలిచే వారని తెలిపారు. మీసాల చంద్రయ్య అనే ఇన్‌చార్జిపై దాడి చేసి, హత్యాయత్నం చేయించిన వ్యక్తి అర్వింద్ అని విమర్శించారు. ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, రాకేశ్‌రెడ్డిని అసలే పట్టించుకోడని.. అమిత్ షా పర్యటనలో ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను అవమానించారని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా నిజామాబాద్‌ను అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. అర్వింద్ అహంకారి అని, మీడియాను సైతం దూషించారని వెల్లడించారు. తెలంగాణ కోసం అందరూ కొట్లాడుతున్న సమయంలో అర్వింద్ మీడియాపై గన్ తీశారని గుర్తుచేశారు. కోరుట్లలో ఓడిపోయిన అర్వింద్‌కు చీమునెత్తురు లేదని, డీ అర్వింద్ అంటే దుర్మార్గపు అర్వింద్ అని ఎద్దేవా చేశారు. 'బీసీ అయిన నువ్వు కోరుట్లలో ఓడిపోయావంటే ఎలాంటి వాడివో అర్థం చేసుకో' అని హితవు పలికారు.

కాంగ్రెస్ వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయింది

- అసెంబ్లీ ఎన్నికల హామీలను తుంగలో తొక్కారు
- ఆర్ఆర్ పన్నుతో ఢిల్లీ కాంగ్రెస్‌కు కప్పం కడుతున్నారు
- బీజేపీ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ధ్వజం

వేములవాడ/వరంగల్, మే 8: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి ఆగిపోయిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను పీడించి ఆర్ఆర్ పన్నులను వసూలు చేస్తున్నదని, ఆ సొమ్మును ఢిల్లీ కాంగ్రెస్‌కు కప్పంగా కడుతున్నదని మండిపడ్డారు. తెలంగాణను కాపాడాలంటే కాంగ్రెస్‌ను వెళ్లగొట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం ఆయన వేములవాడలో రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని, కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం వేములవాడతోపాటు గ్రేటర్ వరంగల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో బీజేపీ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. 'తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చి న ఏ హామీనీ అమలు చేయలేదని అన్నారు. డిసెంబరు 9న పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసగించిందని ధ్వజమెత్తారు. సనాతన ధర్మాన్ని తిట్టేవాళ్లు రుణమాఫీ చేస్తామంటూ దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని విమర్శించారు. అమరవీరులకు పెన్షన్, పేదలకు 250 గజాల ఇంటి జాగా, ప్రతి నెలా మహిళలకు రూ.2,500 హామీలకు దిక్కు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు.

సహారాకు మోదీ వత్తాసు

దేశంలోని 13 కోట్ల మంది వినియోగదారులను మోసం చేసిన సహారా కంపెనీకి మోదీ సర్కారు వత్తాసు పలుకుతున్నదని సహారా బాధితులు ఆరోపించారు.బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో వారు మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 2.80 కోట్ల మంది సహారా బాధితులు ఉన్నారని తెలిపారు. కుటుంబ అవసరాల కోసం సహారాలో దాచుకున్న డబ్బును కొల్లగొట్టిన కంపెనీ డైరెక్టర్లను మోదీ ప్రభుత్వం కాపాడుతున్నదని ఆరోపించారు. అరెస్ట్ అయిన డైరెక్టర్ రావిపాటి రామకోటేశ్వరరావు 24 గంటల్లో బయటకు రావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు.

- కోడ్ ఉల్లంఘించిన మోదీ!

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఎన్నికల సభకు హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. పార్టీ సింబల్‌ను కోటుకు ధరించి ఆలయంలోకి వెళ్లడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని సోషల్ మీడియా లోనూ వైరల్ అయ్యింది. – వేములవాడ

సీఎం నోటి దురద వల్లే రైతు'బందు'

- వాగ్దానాల వరద..అబద్ధాల బురద
- కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లని చెక్కు
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోటి దురద వల్లే రైతుబంధు ఆగిపోయిందని, అయినా మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒక్కో సాకు చూపుతున్నారని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడి యా సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని ఊదరగొట్టారని, కానీ కేసీఆర్ బస్సు యాత్ర తర్వాత క్షేత్రస్థాయి లో పరిస్థితులు మారాయని చెప్పారు. సర్వే ఫలితాలు చూస్తే రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డిలకు దిమ్మతిరుగుతున్నదన్నారు. వాగ్దానాల వరద, నోటి దురద, అబద్ధాల బురద తప్ప రేవంత్‌రెడ్డి దగ్గర ఏమీ లేదంటూ ఎద్దేవాచేశారు. కేసీఆర్ బస్సు యాత్ర భయంతోనే రైతుబంధును మళ్లీ మొదలుపెట్టారని, తర్వాత ఈసీ ఆపాలని చెప్పిందని కుంటిసాకులు చెబుతున్నారని, రైతుబంధు విషయంలో బీఆర్ఎస్ ఎక్కడా ఫిర్యాదు చేయలేదని స్పష్టంచేశారు. రైతుల సంక్షేమం కోసమే బీఆర్ఎస్ పనిచేస్తున్నదని, పార్లమెంట్ ఎన్నికల్లో రైతులు బీఆర్ఎస్ వైపే ఉంటారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు రూ.2500 ఇస్తున్నామని రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెల్లని చెక్కులాంటిదని దుయ్యబట్టారు. కేసీఆర్ సభలకు జనం పోటెత్తుతుంటే, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్ సభలకు ఎవరూ రావడం లేదనే వారు మోదీ, అమిత్ షా, నడ్డాలను పిలిపించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పదేండ్లలో రాష్ట్ర విభజన హామీలు ఎన్ని నెరవేర్చారో చెప్పి బీజేపీ ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో కేంద్రం చేపట్టిన రెండు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు ఏండ్ల తరబడి అసంపూర్తిగానే ఉన్నాయని, కేటీఆర్ ఆధ్వర్యంలో 37 ఫ్లైఓవర్ బ్రిడ్జిలను బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిందని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై బీఆర్ఎస్‌ను ఓడించాలని చూస్తున్నాయని, పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినిపించేది బీఆర్ఎస్ ఒక్కటేనని, రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు మాత్రమే క్యాడర్ ఉందని స్పష్టంచేశారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

బీఆర్ఎస్‌కే అత్యధిక సీట్లు

- జననేత కేసీఆర్ బస్సు యాత్రకు అపూర్వస్పందన
- బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి ఎన్నారైల ప్రచారం
- గ్లోబల్ ఎన్నారై సెల్ సమన్వయకర్త మహేశ్ బిగాల

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీనే అత్యధిక సీట్లు కైవసం చేసుకోబోతున్నదని ఆ పార్టీ గ్లోబల్ ఎన్నారై సెల్ సమన్వయకర్త మహేశ్ బిగాల ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్‌కు, కేసీఆర్ బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. బుధవారం తెలంగాణభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ఎన్నారైలు కేసీఆర్ వెంట నడుస్తున్నారని, బృందాలుగా విడిపోయి వివిధ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు. బస్సు యాత్రతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బయటకు వచ్చాక కాంగ్రెస్, బీజేపీల్లో భయం మొదలైందని తెలిపారు. కేసీఆర్ బస్సు యాత్రతో బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని, కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమేనని మహేశ్ బిగాల స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఎనిమిది నుంచి 12 సీట్లు వస్తాయని, కేంద్రంలో కేసీఆర్ కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తిచేశారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ఎన్నారైలు పని చేస్తున్నారని, బీఆర్ఎస్‌నేత అనిల్ కుర్మాచలం చెప్పారు. తెలంగాణను దేశంలో తిరుగులేని రాష్ట్రం గా కేసీఆర్ తీర్చిదిద్దారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్ రెడ్డి, ఎన్నారై నాయకులు దూసరి అశోక్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

రాజకీయాల కోసమే ప్రధాని రాజన్న గుడికి

- వేములవాడ అభివృద్ధి కోసం ఒక్క హామీ ఇవ్వని మోదీ
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కృషితో వేములవాడ అభివృద్ధి
- మీడియాతో బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్, మే 8 (నమస్తే తెలంగాణ): సాక్షాత్తు ప్రధానమంత్రి వేములవాడకు వస్తున్నారంటే.. రాజన్న పుణ్యక్షేత్రం అభివృద్ధికి నిధులు ప్రకటిస్తారని ఆశించామని, కానీ.. ఒక్క హామీ ఇవ్వకుండా.. కేవలం రాజకీయ సభకు హాజరై వెళ్లిపోయారని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అసంతృప్తి వ్యక్తంచేశారు. నవోదయ పాఠశాలలు ఇచ్చారా? మెడికల్ కళాశాలలు ఇచ్చారా? జాతీయ ప్రాజెక్టులు ఇచ్చారా? రాష్ట్రానికి ఏమీ చేయలేని బీజేపీకి ఓట్లు ఎందుకు వేయాలని నిలదీశారు. దేవుళ్ల పేరు చెప్పి రాజకీయం చేస్తున్న బండి సంజయ్ కావాలో,అనునిత్యం అభివృద్ధి కోసం తపించే తాను కావాలో కరీంనగర్ ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ వేములవాడకు వచ్చి రాజన్న దర్శనం చేసుకున్నారని, అయితే.. ఆలయ అభివృద్ధికి ఒక్క పైసా హామీ ఇవ్వకుండా వెళ్లిపోయారని మండిపడ్డారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడను వారణాసిలా అభివృద్ధి చేస్తారని ఆశించామని, కానీ ఆయన కేవలం రాజకీయాల కోసమే వేములవాడకు వచ్చినట్టు స్పష్టమైందని తెలిపారు. ఇంతటి పుణ్యక్షేత్రంలో సభ ఏర్పాటు చేసి.. ఆలయ అభివృద్ధి కోసం బండి సంజయ్ అయినా ప్రధానిని ఒక్క రూపాయి అడుగకపోవడం ఆయన అసమర్థతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. తాను ఎంపీగా ఉన్నపుడు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన 'ప్రసాద్' పథకంలో వేములవాడ, కొండగట్టు దేవాలయాలను చేర్చాలని అప్పటి కేంద్ర మంత్రి శర్మకు వినతి పత్రం సమర్పించామని గుర్తుచేశారు. వేములవాడ గుడికి నిధులు ఇవ్వాలని కోరిన లేఖలను ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మీడియా ముందు ప్రదర్శించారు. వేములవాడ పుణ్యక్షేత్రం అభివృద్ధి కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు 32 ఎకరాల స్థలాన్ని కేటాయించారని, ఈ భూమిలో విస్తరణ పనులు చేపట్టారని తెలిపారు. రాజకీయాల కోసం ఎస్సీ, ఎస్టీలను భయాందోళనకు గురిచేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు ఎల్ రమణ, భూనాప్రసాద్‌రావు, నగర మేయర్ వై సునీల్‌రావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.